# వలపు గెలుపు

శ్రీమతి వి ఎస్ లక్ష్మి

ఇంద్రాదిదేవతలు నలరూపం ధరించి స్వయంవరమునకు వస్తారని దమయంతి వింటుంది. గుండె చెరువై పోతుంది. మర్నాడే స్వయంవరం. ఆ రాత్రి చెలికత్తె వసంతతో ..

దమ—కంచే చేనునుమేస్తే ఇంకేమి చెయ్యగలం వసంతా!

వసం—అవును దేవీ! ధర్మ విరుద్ధమైన వార్తయే విన్నాము.

దమ—రంభా ఊర్వసాది అప్సరలు సరిపోయారు కాదా ఈ దేవతలకు.

వసం—దేవీ! నీ సౌందర్యం ముందు రంభా ఊర్వశులు దిగదుడుపు అని చెప్పుట అతిశయోక్తికాదు. ముఖప్రియమునకై చెప్పిన మాటగాదు. దేవతల మారువేషధారణమే దీనికి తార్కాణం.

దమ—అందముగా ఉంటే పీడించుట ధర్మమా!

వసం—యోగ్యులగు పురుషులు అరుదు.

దమ—స్త్రీ సౌందర్యవతియగుట ఆమె దోషమా! వసంతా! ప్రకృతిలో ఎన్ని సౌందర్య వస్తువులు లేవు. లేత ఉషస్సు, సంధ్యారాగము, వికసితపుష్పము, పున్నమి చంద్రుడు! స్త్రీ సౌందర్యముకూడా ప్రకృతి జన్యమే కదా!

వసం—సాధ్యముకాదు గనక గానీ లేకపోతే లేత ఉషస్సు, సంధ్యారాగమును పెరటిలో కట్ట గోరకపోదురో స్వార్థ మానవులు?

దమ—నా మనస్సు వికలమైపోవుచున్నది వసంతా! నలుడు కూడా నా అందమును చూసేనా ప్రేమిస్తూన్నది! అది ప్రేమయా! మోహమా! శక్యమైనచో నా యీ దుర్భర తాపహేతూ భూతమగు సౌందర్యమును సమయింపజేసి అనూయా గ్రస్తులు ఇంద్రాదిదేవతల తీక్ష్ణరూక్షములకు గురిగాకుండా నా ప్రియుని నేను చేరకపోయెదనా! అయితే వసంతా నలునిదిమోహమా! ప్రేమా!

వసం—దేవీ! విషమమగు ప్రశ్నయే వేసినావు. కాని ఒక్కవిషయము. నలుడు నిన్ను చూడకుండగనే మనస్సునీపై లగ్నము చేసినాడు. గుణసంపదలను ప్రేమించిన నలుని, సౌందర్యకాముకులగు దేవతలతో జతపరుపకు దేవీ!

దమ—అవును నిజమే! నలునిది నిష్కల్మష నిష్కామ ప్రేమ. దేవతలు కామాంధులు!

వసం—సత్యము దేవీ!

దమ—అయిన దేవతల మాయా నలులనుండి మానవనలుని గ్రహించుటెట్లు!

వసం—అదే ఆలోచించుచున్నాను దేవి!

దమ—ఓ దేవతలారా! మీరునూ కామక్రోధాది అరిషడ్వర్గహత స్వభావులా! మీరు నివసించు పుణ్యలోకములు స్త్రీలోలుర విహారములా! హా! విధీ. దేవతాపతులే మానవులను, అందులో అబలలను హింసింప జూచినచో ఇకవారికి రక్షణ ఎక్కడిది? ఈశ్వరా! ఈ దేవతాపతుల కుహనా కుతంత్రమునుండి విముక్తురాలనుచేసి నా హృదయాధిపతిని నాకు చూపవా! వసంతా! కళ్లు తిరుగుచున్నవి. తల దిమ్మగనున్నది. నేను నా నలుని పొందు మార్గము చూపలేవా! దేవతల మోసమునుండి వెలివచ్చు మార్గము నాకు చూపవా!

వసంత—దేవీ-పోయి నిద్రింపుము! నీవు చాలా డస్సిపోయితివి. ఉపాయము కన్పించకపోదు. ఎంత మాయా రూపము ధరించినను మానవులకూ దేవతలకూ భేదము లుండక పోవుగదా!

* * * * *

# వలపు గెలుపు

మర్నాడు స్వయంవరసమయ మాసన్నమౌతుంది. పలు దేశముల రాకుమారులు సర్వమణిమయ భూషణ భూషితాంగులై సభ నలంకరించియుండిరి. ఒక్కొక్కరి చేతిలో ఒక్కొక్క తామరపూవున్నది. ఒక్కొక్కరివద్దకే దమయంతి తీసికొనిపోబడుతూంది. ఒక్కొక రాకుమారుని పేరు రాజ్యముపేరు, వారి వారి శౌర్యసాహసాది సద్గుణ వివరములు ప్రక్కన వర్ణించబడుతున్నాయి. దమయంతి ఒక్కొక్కరినే దాటిపోవుచున్నది. తలనైననూ ఎత్తుటలేదు. ప్రార్థనా నిమగ్న హృదయయైనట్లు ఆమె ముఖము చెప్పుచున్నది. నలునిపేరు చదువుసరికి ఉలికిపడి పైకి చూచినది. నల్గురు నలులు ఒకేరూపములో ప్రత్యక్షమయినారు. గుండె దడదడ కొట్టుకొన ప్రారంభించింది. ముఖముపై ముచ్చెమటలు పోసినవి. శరీరము ఆపాదమస్తకమూ కంపించ దొడగినది. చేతిలో దండ దడదడలాడుచున్నది. కాని దమయంతి ముఖములో ఇసుమంతైననూ విషాద సూచనలు పొడకట్టలేదు. ఆమె నల్గురు నలులవైపునూ తీక్ష్ణముగా పరకాయించి చూచుచున్నది. ఒక త్రుటిలో ఆమె ముఖముపై మెరపు తీగ మెరిసింది. పెదవులపై చిన్న వికాసము తోచినది. వారిలో ఒక్కని చేతిలోని తామర పుష్పము మాత్రము కొంచెముగా వాడి వంగి ఉన్నది. ఆమె హృదయము స్థిమితపడింది. ముఖములో నూత్న వర్చస్సు గోచరించుచున్నది. ఇంద్రాది దేవత లొకరివై పొకరు చూచుకొనచూ దమయంతిలో కల్గిన నూత్న మార్పునకు హేతువులను వెదకుకొనుటకు తికమకలు పడుచున్నట్లున్నారు. దమయంతి ఆనందాతిరేకముతో ఇంకనూ తీక్ష్ణముగా పరీక్ష చేసింది. తనకు స్ఫురించిన ఉపాయములన్నియూ ఉపయోగించింది. వారి కండ్లవైపు తేర పారిచూసింది. కొందరి కనురెప్పలెంతయో సేపటివరకూగూడా మూసికొనుటలేదు. ఆ పాదమస్తకమూ పరీక్షించింది. ఎక్కడా మార్పు కన్పించుటలేదు. ఆకారము సమానము. అంగసౌష్టవములో ఒక్క తీరుగానున్నారు. దుస్తులలో భేదములేదు. కాని కొందరి పాదముల బొటనవ్రేళ్లు మాత్రము ఆనియుండలేదు. కుహానా నలుల నల్గురి పాదములను ఒకదానివెంట నొకటి శరవేగ దృష్టితో చూసింది. మానవ నలుని పాదతలమునూ పరీక్షించింది. తన తొలి యభిప్రాయము ధృవపడింది. ఆమె ముఖవికాసము సహస్రకరదీప్తివంతమయినది. ఒక్క నిట్టూర్పు విడిచింది. గులాబిరేకులవంటి పెదవులపై మల్లెపూవులవంటి చిరునవ్వులు కెరటాలవలె పొంగి పొరలాయి. తాపీగా గజగమనముతో ఒక్కొక్క అడుగునే కదలించి కుహానా నలులనొక్కొక్కరివైపే దృష్టి సారించి మరల్చి దాటి వెడుతూంది. దేవతాధిపతుల ముఖములో కళకాంతులు సన్నగిల్లాయి.

దమయంతి ఒక్కొక్కరినే దాటిపోయి పాలనుండి నీటిని విడదీయు హంసవలె ముందుకుపోయి తన చేతిలోని పూలమాలతో మానవ నలుని కంఠసీమ నలంకరింపజేసింది. నలుని ముఖములో వెన్నెల అరబోసినట్లు తోచింది. మాయ నలులురివ్వున మాయమయి పోయారు. సభ నలంకరించిన రాజపుత్రులు కరతాళనతో తమ ఆమోదము తెల్పారు. నల దమయంతుల పులకిత గాత్రములు వలపుగెలుపును ప్రకటించాయి.